క్లుప్తంగా

నేడు ఒనుములమ్మతల్లి జాతర



తుని రూరల్: మండలంలోని డి.పోలవరం గ్రామదేవత ఒనుములమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారి జాతరోత్సవాల్లో సోమవారం రాత్రి రేలారే-రేలా, సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవారిని దర్శించి, భక్తులు మొక్కుబడులు తీర్చుకుంటారు. సాయంత్రం తీర్థం వైభవంగా జరుగుతుంది. రాత్రికి ధాండియా డ్యాన్స్, కేరళ డ్యాన్స్, శక్తి వేషాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, కోలాటం, డ్యాన్స్ హంగామా, బాణసంచా కాల్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామ దేవత పండగ కావడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న బంధువులు, ఆడపడుచులు గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

అవార్డు గ్రహీతకు సత్కారం



క్యాన్సర్ వైద్యుడు వీర్రాజును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: క్యాన్సర్ నివారణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను డాక్టర్ వీర్రాజుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం చేసింది. ఈ అవార్డును కాకినాడ సూర్య గ్లోబల్ ఆసుపత్రి అధినేత, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డాక్టర్ వీర్రాజు ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు పొందిన వైద్యుడు వీర్రాజును ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం శాలువా, పూలమాలతో సత్కరించారు. వీర్రాజును పలువురు అభినందించారు. కార్యక్రమంలో సుధీర్ రాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మికి ఉత్తమ సేవా అవార్డు



డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజ్యలక్ష్మి

ఏలేశ్వరం: స్థానిక సీహెచ్‌సీలో ఐసీటీసీ కౌన్సిలర్‌గా పని చేస్తున్న జి.రాజ్యలక్ష్మికి బెస్ట్ ఎంప్లాయి అవార్డు (ఉత్తమ సేవా పురస్కారం) లభించింది. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా కాకినాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ నరసింహం ఆమెకు అవార్డు అందజేశారు. అవార్డు పొందిన రాజ్యలక్ష్మిని సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతనం కార్యవర్గం

ఏలేశ్వరం: పట్టణంలోని లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక లారీ ఓనర్స్ కల్చరర్ అసోసియేషన్ కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షుడిగా మట్టే సుబ్బారావు, అధ్యక్షుడిగా జ్యోతుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వాకాడ కనకరాజు, కార్యదర్శిగా గొర్లె శివ, సహాయ కార్యదర్శులుగా అట్టాడ ఆనందరావు, తోట రాంబాబు, కోశాధికారులుగా వడ్డాణపు లోవరాజు, వైబోగుల సుబ్బారావు, సభ్యులుగా పి.అక్కారావు, కిలపర్తి భాస్కర్, పెనుకొండ రాంబాబుతో పాటు 11 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తుని రూరల్: రెండు నెలలుగా తుని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఇంజినీర్స్ అండ్ ఎల్టీపీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టీవీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కుంద్రపు రామకృష్ణ, కార్యదర్శి వైఎస్సార్ కృష్ణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుభాష్, డైరెక్టర్ తేజోమూర్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త!

- గ్రామాల్లో శునకాల స్వైర విహారం
- వృద్ధులు, పిల్లలపై దాడులు
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- పట్టించుకోని అధికారులు



ప్రత్తిపాడులో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. పల్లెల్లో రోజురోజుకూ వాటి బెడద ఎక్కువవుతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధుల్లో తిష్టవేసి పిల్లలు, వృద్ధులపై దాడులకు దిగుతున్నాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కకాటుకు గురై ఆసుపత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిని నివాస ప్రాంతాలకు దూరంగా తరలించడం గాని, నియంత్రించడం గాని చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

నెలకు 500లకు పైగా కేసులు

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గ్రామాల్లో కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోయింది. కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టకపోవడంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎక్కడికక్కడ గ్రామసింహాలు మనుషులపై దాడులకు దిగుతున్నాయి. చాలా మంది కుక్క కాటుకు గురవుతున్నారు. మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోజుకు ఐదు నుంచి 10 కేసులు నమోదవుతున్నాయి. పెద్దిపాలెం, శాంతి ఆశ్రమం, రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో భారీగా కేసులు నమోదవుతున్నాయి. మండల వ్యాప్తంగా సాధారణ రోజుల్లో నెలకు 500లకు పైగా కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఆర్‌వీలు అందుబాటులో ఉంచుకోవాల్సి వస్తోంది.

ముందుకు సాగని కుక్కల నియంత్రణ

గ్రామాల్లో కుక్కల నియంత్రణ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. కుక్కల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టడంతో వాటి సంఖ్య ఘననీయంగా తగ్గేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

బయటకు వెళ్లలేకపోతున్నాం



గ్రామాల్లో అధిక సంఖ్యలో ఉన్న వీధి కుక్కలను నిర్మూలించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రతినిత్యం ఎంతో మంది కుక్కకాటు గురవుతున్నారు.

–మొల్లి రాజబాబు, వేములపాలెం, ప్రత్తిపాడు మండలం

రోజుకు ఐదు కేసులు



ఆసుపత్రిలో రోజుకు ఐదు కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నాయి. బాధితులకు ఏఆర్‌వీలు, రిగ్ వ్యాక్సిన్లు ఇస్తున్నాం. కుక్కకాటుకు గురవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నెలకు 130కి పైగా కేసులు వస్తున్నాయి.

–డాక్టర్ సౌమ్య, ఆర్‌ఎంఓ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి



పెంపుడు కుక్కల నుంచి ర్యాబిస్ వ్యాధి సోకకుండా విధిగా టీకాలు వేయించుకోవాలి. వీధి కుక్కల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతం కన్నా కుక్కల సంఖ్య భారీగా పెరిగింది. వాటి నివారణపై దృష్టి సారిస్తాం

–డాక్టర్ ఎస్.వరలక్ష్మి, మండల పశువైద్యాధికారి, ప్రత్తిపాడు

కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశం మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

తొండంగి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ నేత యనమల కృష్ణుడు అన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు సోమవారం ఒంటిమామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కక్షసాధింపు ధోరణికి బయపడే ప్రశక్తే లేదన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందన్నారు. వర్గవిభేదాలు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొయ్యా మురళి, డి.సూర్యచక్రం, గాబు రాజు, లోవదేవస్థానం డైరెక్టర్ నడిగట్ల అనిల్, పేకేటి హరికృష్ణ పాల్గొన్నారు.

పారేపల్లి వీరబాబుకు పరామర్శ

మండలంలోని ఆనూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు పారేపల్లి వీరబాబు తండ్రి అప్పారావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం ఆనూరులో వీరబాబు స్వగృహానికి పార్టీ నాయకులతో వెళ్లి పరామర్శించారు. అప్పారావు మృతికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, పార్టీ నాయకులు డి. సూర్యచక్రం, గాబు రాజు, నరిసే తాతీలు, రెడ్నంశెట్టి త్రిమూర్తులు, కాశిందేవుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ



జగ్గంపేట శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణి

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నీటి సంఘం ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. పెద్దాపురం ఆర్డీఓ కె.రమణి శిక్షణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 8న జగ్గంపేట మండలంలో 16 చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. జగ్గంపేట తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28న నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు

శంఖవరం: నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు స్థానిక తహసీల్దార్ పోతురాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. అధికారులు సమష్టిగా పనిచేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ, వీఆర్‌ఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై తొండంగిలో సిబ్బందికి సోమవారం తహసీల్దార్ మురార్జీ శిక్షణ ఇచ్చారు. మంలంలోని 16 సాగునీటి సంఘాలకు 120 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. నీటిసంఘాల ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలు, ఓటర్ల జాబితా పరిశీలన, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై తహసీల్దార్ శిక్షణ ఇచ్చారు.

ఘనంగా కార్తిక వనసమారాధన



రాచపల్లి వనసమారాధనలో పాల్గొన్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి గ్రామంలోని గంగాలమ్మ ఆలయం వద్ద సోమవారం కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. గంగాలమ్మ యాదవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వనసమారాధనకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు ముద్రగడ గిరిబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సుబ్బారావు, ఆ పార్టీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత గంగాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజనాలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, గంగరాజు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, గొల్లపల్లి దొరబాబు, పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో పంటల సంరక్షణ

- ఏరువాక కేంద్రం సమన్వయ కర్త సీతారామశర్మ
- దెబ్బతిన్న పంటల పరిశీలన



డి.పోలవరంలో నేలకొరిగిన పంట సంరక్షణపై రైతులకు సూచనలు ఇస్తున్న సీతారామ శర్మ

తుని రూరల్: ఫెంగల్ తుపాను తాకిడికి గురైన వరి పంటలను యాజమాన్య పద్ధతులతో సంరక్షించుకోవాలని ఏరువాక కేంద్రం పెద్దాపురం డివిజన్ సమన్వయ కర్త డాక్టర్ శ్రీతారామ శర్మ సూచించారు. మండల ఏఓ బి.అశోక్ కుమార్, వీఏఏలతో కలసి సోమవారం ఆయన డి.పోలవరం గ్రామంలో పర్యటించారు. వర్షానికి తడిసిన పనలు, నేలకొరిగిన వరిపైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. చేలల్లో నిల్వ ఉన్న నీటిని కాలువల ద్వారా తీసివేయాలన్నారు. నేలకు ఒరిగిపోయిన పంటను నిలబెట్టి కట్టలుగా కట్టాలన్నారు. తడిసిన పనలపై ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పునీటి ద్రావణం పిచికారీ చేయాలన్నారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

పుంత ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు



తాళ్లూరులో ఆక్రమణకు గురైన పుంతను చూపిస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో పుంత ఆక్రమణపై సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు పైణ్ని శ్రీనివాసరావు, సూరిబాబు తెలిపారు. గ్రామంలోని జాతీయ రహదారికి సమీపంలో కొత్తకాలనీని ఆనుకుని ఉన్న పుంతను కొందరు ఇరువైపులా ఆక్రమించి తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలు చేపట్టారన్నారు. పుంతలో కొంత భాగం ఆక్రమణకు గురికాగా మరికొంత మేరలో తుప్పలు పెరిగిపోయి నీరు ప్రవహించే మార్గం మూసుకుపోయిందన్నారు. గతంలో ఈ మార్గం ద్వారా వర్షపు నీరు, వరద నీరు పోయేదని, ప్రస్తుతం ఆక్రమణకు గురికావడంతో నీరు ముందుకు పారడం లేదని స్థానికులు సీమంతుల స్వామి, కొత్తపల్లి సూరిబాబు, మలిరెడ్డి దొర తదితరులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ సేవలు అభినందనీయం



తునిలో లక్ష్మీశ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆ సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. సోమవారం తునిలో ఆమె పర్యటించారు. లోవకొత్తూరు కేజీబీవీలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కేజీబీవీ విద్యార్థినులకు మంచం, మిక్సీని బహూకరించారు. అనంతరం రోటరీ హాలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంతో ఇన్నర్‌వీల్ సంస్థ ముందు వరుసలో ఉంటుందన్నారు. నిరంతరం ప్రజాసేవ చేస్తున్న తుని ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. ఓ మహిళకు కుట్టుమెషీన్, ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సహాయం, చిరువ్యాపారులకు గొడుగులు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు కె.నళిని, విజయలక్ష్మి, కుసుమంచి వరలక్ష్మి, శిరీష, సంధ్య పాల్గొన్నారు.

స్త్రీనిధి సొమ్ములు స్వాహాపై విచారణ

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి గ్రామ సంఘం-1లో యానిమేటర్ చేతివాటం ప్రదర్శించి డ్వాక్రా మహిళల స్త్రీనిధి సొమ్ములు స్వాహా చేసిన విషయం విధితమే. దీనిపై స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, ఏపీఎం ఎస్.వేదకుమారి సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఆర్‌డీఓ కె.శ్రీరమణి ఆదేశాల మేరకు డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులను విచారణ చేశామన్నారు. ఎనిమిది సంఘాల రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీసీ శాంతి, వీఓఏలు, గ్రామ సంఘం ఓబీలు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా చంటమ్మ

తొండంగి: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఐకేపీ కార్యాలయంలో సోమవారం జరిగింది. సంఘ సర్వసభ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఐకేపీ ఏపీఎం సత్తిబాబు తెలిపారు. సంఘ నూతన అధ్యక్షురాలిగా బోడపాటి చంటమ్మ, ఉపాధ్యక్షురాలిగా సన్ని లక్ష్మి, కార్యదర్శిగా కె.కృష్ణవేణి, కోశాధికారిగా కాలిన బేబిలతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు అభినందనలు తెలపారు. అనంతరం భవిష్యత్ కార్యచరణ, పలు తదితర అంశాలపై చర్చించారు. బాల్యవివాహాల నివారణపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 72 డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



జగ్గంపేట బస్టాండ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. జగ్గంపేట బస్టాండ్‌లో విద్యార్థులు, ప్రయాణికులకు సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగే తీరును, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి సమావేశం

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు సోమవారం సాయంత్రం ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యతా ఓటును తనకు వేయాలని అభ్యర్థించారు. ఆయనతో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్తిపాడు ఎస్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సారా విక్రేతలు దాకే సుబ్బలక్ష్మి, వీధి చిన్నోడులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక్కొక్కరి నుంచి పది లీటర్ల చొప్పున సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

జగ్గంపేట: స్థానిక సర్కిల్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి 10 మందిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరిలో ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, 8 మందికి రెండు రోజుల చొప్పున జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్లు సీఐ శ్రీనివాస్ వివరించారు.

కార్తికం.. పరిసమాప్తం

- ముగిసిన కార్తిక మాస సందడి
- భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం పూజలు



ఏలేశ్వరం ఏలేరు నదిలో దీపాలు వదులుతున్న మహిళలు



అన్నవరం పంపా కాలువ వద్ద పాడ్యమి దీపాలతో భక్తుల సందడి



తాళ్లూరు మఠంలో పూజలు చేస్తున్న మహిళలు



లంపకలోవలో గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పవిత్ర కార్తిక మాసం సోమవారంతో ముగిసింది. కార్తికమాసం ముగింపు, పోలలామావాస్యను పురస్కరించుకుని సోమవారం తెలవారుజాము నుంచి శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని ఏలేరు నదిలో మహిళలు భక్తిశ్రద్ధలతో అరటి తెప్పలపై దీపాలు వెలిగించి వదిలిపెట్టారు. బ్రహ్మణులకు స్వయంపాకం ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయంలోని ధ్వజస్తంభం, శివలింగం వద్ద దీపాలు వెలిగించారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

మహిళలతో కిక్కిరిసిన పంపా ఘాట్‌లు

అన్నవరం: కార్తికమాసం ముగింపును పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున భక్తులు స్థానిక పంపా నది వద్ద పూజలు చేసి పాడ్యమి దీపాలను నదిలో విడిచి పెట్టారు. పవర్ ఆఫీసు వద్ద గల పంపా ఘాట్లు, పంపా సత్రం వెనుక గల పంట కాలువల వద్ద భక్తుల సందడి కనిపించింది. మహిళలు వెలిగించిన దీపాలతో నదీతీరాలు ప్రకాశించాయి.

శివాలయంలో అన్నదానం

కార్తికమాసం ముగింపును పురస్కరించుకుని పంపా సత్రం వద్ద గల గంగా పార్వతి సమేత భూలోకేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం మహాఅన్నదానం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా సోమవారం పోలిస్వర్గం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. తాళ్లూరు జీయ్యన్న మఠంలోని గజేంద్ర పుష్కరిణిలో తెల్లవారుజామున మహిళలు కార్తిక దీపాలు వదిలారు. కార్తిక దామోదరునికి పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మఠ అర్చకులు పాడుగు ప్రసాదాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. మల్లేపల్లిలో చిన్నారులు, మహిళా భక్తులు అఖండ జ్యోతిని శిరస్సుపై ఉంచి శివనామస్మరణతో గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. నీలకుండీలపేటలో భారీ అన్నదానం నిర్వహించారు.

ప్రత్తిపాడు: పోలిపాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్తిపాడులోని పుష్కర కాలువ, సమీప చెరువులు, కాలువల వద్ద తెల్లవారుజామున భక్తులు పూజలు నిర్వహించి, కార్తిక దీపాలను వదిలిపెట్టారు. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి పంచాయత ఆలయం, విజయదుర్గదేవి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని ఏలూరు, పెదశంకర్లపూడి, లంపకలోవ గ్రామాల్లో నగర సంకీర్తన నిర్వహించారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

గోకవరం: పవిత్ర కార్తిక మాసంలో చివరి రోజును పురస్కరించుకుని మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, రమాసత్యనారాయణస్వామి, కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి, తంటికొండలో అఖిలాండేశ్వరి సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగించడంతో పాటు బ్రాహ్మణులకు దీపాలు దానం చేశారు. గోకవరం శివాలయంలో నెలరోజుల పాటు పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు, పలువురు సేవకులను భక్తులు సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోలవరం, ఏలేరు, పుష్కర, సుబ్బారెడ్డి సాగర్ కాలువల్లో కార్తిక మాసానికి వీడ్కోలు పలుకుతూ భక్తులు తెల్లవారుజామున పాడ్యమి దీపాలను వదిలిపెట్టారు. రాచపల్లిలో అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఒమ్మంగి ఉమారామలింగేశ్వరస్వామి, శాంతిఆశ్రమం విశ్వనాథుని ఆలయం, గజ్జనపూడి రామలింగేశ్వరస్వామి, ధర్మవరం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు భారీగా తరలిరాడంతో కిటికిటలాడాయి. ధారపల్లి, ఎరకంపాలెం జలపాతాల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.